అదృష్టం చూసి గర్వపడవద్దు, మీ మొఖంలో అవినయం రానివ్వకండి. నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావు లేదు, పుట్టుక లేదు, దానికి దేహం అక్కరలేదు. బాహ్యంగా వచ్చే హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా నీ మనస్సును హృదయంలో ఉన్న నిజంమీద నిలబెడితే అప్పడు అది నీకు ఎరుకలోనికి వస్తుంది. అది మనం నోటితో చెప్పకొన్నంత తేలిక కాదు. దానికి చాలా ధైర్యం ఉండాలి. వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అనుకొంటే నువ్వు హృదయగుహలోనికి వెళ్లలేవు. మనం సుఖపడాలంటే ఒక మార్గం చెపుతున్నాను. ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు ఎవరు ఇది నీజాలము అరుణాచలా. నీవు ఒక్కడివే కాని ఇన్ని రూపాలలో కనిపిస్తున్నావు. ఈ జాలంలో మేము పడ్డాము. మాయ ఆయన చేతిలో ఉంది, మాయ చేతిలో మనం పడ్డాము. అందుచేత ఆయన పాదాలను ఆశ్రయించి ఈ మాయలో నుండి బయటపడాలి. భౌతికం వేరు, ఆధ్యాత్మికం వేరు అని చాలామంది అనుకొంటున్నారు. భౌతికం వేరు, ఆధ్యాత్మికం వేరు కాదు. దేవుడి దగ్గర అరటిపండు పెట్టేటప్పడు ఏ భావనతో పెడుతున్నావో, ఎవరికైనా ఇచ్చేటప్పడు కూడా అదే భావనతో ఇవ్వాలి, అలా చేస్తే ప్రతీదీ పూజే, అప్పడు ఉన్నదంతా ఆధ్యాత్మికమే, ఇలా కనుక మనం అర్థం చేసుకొని చేస్తే అంతా పూజే, అప్పడు మీకు మారుమనస్సు కలుగుతుంది, ఈశ్వరుని దయకు పాత్రులవుతారు, మీరు తరిస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 21-05-06, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రతీ మనిషికి సుఖం కావాలి, శాంతి కావాలి. శాంతి ఎక్కడ దొరకదో, సుఖం ఎక్కడ దొరకదో అక్కడ మన ఇంద్రియాలు వెదుకుతూ ఉంటాయి. మనస్సు వెదుకుతూ ఉంటుంది. బేసిక్‌గా మనం చేసే పొరపాటు అది. ప్రపంచంలో సుఖం లేదు, శాంతి లేదు. నిష్ప్రపంచస్థితిని పొందినవాడిని, ప్రకృతిని దాటినవాడిని శాంతి వరిస్తుంది, సుఖం వరిస్తుంది కాని ఎవడైతే ప్రకృతిని అతిక్రమించలేడో వాడికి శాంతి లేదు, సుఖం దొరకదు. మనం పుస్తకం చదివేటప్పడు అంతా అర్థమయిపోయింది అని అనుకొంటాము కాని ఏమీ అర్థమవ్వదు. ఉదాహరణకు ఒక వాక్యం చెపుతాను. అహంభావన ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. మీలో ఈ వాక్యం ఎంతమందికి అర్థమయ్యింది. అహంభావన ఉండటం, దానిని పోగొట్టుకోవటం మాట వదిలివేయండి. అసలు అహంభావన అంటే ఇట్టిది అని తెలియటానికి కొన్ని జన్మలు పడుతుంది. కృష్ణుడు గీతలో చెప్పాడు సాధన చేయనివారి మాట వదిలివేయండి, సాధన ప్రారంభించిన తరువాత కూడా బహుజన్మలు కృషి చేస్తేనే కాని వారికి ఆత్మజ్ఞానం కలుగదు అని పరమాత్మ

చెప్పాడు. సత్యం కానిదానిని సత్యం అనుకోవటం, ఆత్మకానిదానిని ఆత్మ అనుకోవటం ఇలా తిరకాసు పెట్టేది ఎవరో ఇతరులు కాదు, అహంభావనే చేస్తోంది. శరీరానికి వచ్చిన జబ్బును తొందరగా వదిలించుకోగలం కాని అహంభావనను వదిలించుకోవటం చాలా కష్టం. ఒక మనిషిలో ఎంతకాలం అయితే అహంభావన ఉందో వాడికి వెయ్యి కోట్లు డబ్బు ఉన్నా, ఎంత చదువు ఉన్నా కూడావాడు దుఃఖంలో నుండి బయటకు రాలేడు.

మన పుట్టుకతోటే శరీరంతో పాటు రాగద్వేషాలు కూడా వచ్చేసాయి, వయస్సు వచ్చేకొలది వాటి ప్రభావం మన మీద పడుతూ ఉంటుంది. రాగద్వేషముల యొక్క వేగం చాలా బలీయంగా ఉంటుంది. గోదావరికి వరద వచ్చింది అనుకోండి. వరద వచ్చినప్పుడు నాకు ఈత వచ్చును అని ఈదటానికి ప్రయత్నం చేస్తే ప్రయోజనం లేదు, ప్రవాహవేగంలో కొట్టుకొని పోతావు. అలాగే మనం ఏదో గుడికి వెళుతున్నాము, అభిషేకాలు చేస్తున్నాము. ఏదో కర్మ చేస్తున్నాము అంటే రాగద్వేషాల నుండి బయటకు రావటానికి ఇది సరిపోదు, దానికి చాలా సాధనాబలం ఉండాలి. ప్రతీ మనిషి రాగద్వేషముల యొక్క వేగంలో కొట్టుకొని పోవటం వలన వాడి మనస్సు హృదయంవైపుకు తిరగదు, వాడు సత్యాన్వేషకుడు కాలేడు, ఆత్మసుఖాన్ని పొందలేడు. ఒక మనిషి దుర్మార్గంలో ఉన్నాడు అనుకోండి, వాడు పూజ చేస్తూ ఉంటాడు, జపం చేస్తూ ఉంటాడు అనుకోండి. వాడికి భగవంతుడు తెలియబడడు. భగవంతుడు అమాయకుడు కాదు. నీవు చేసేటప్పుడు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నావో ఆ తలంపును భగవంతుడు చూస్తాడు, బాహ్యంగా నీవు చేసే పనిని ఆయన చూడడు. ఉపనిషత్‌లో ఒక మాట ఉంది. శిష్యుడు గురువు దగ్గరకు వెళ్ళి ఏదైనా బోధ చేయమని అడిగాడు. “ద, దా, దా” ఈ మాటలు మీరు అర్థం చేసుకొని ప్రాక్టీసు చెయ్యండి అని గురువు చెప్పాడు. మొదటి ‘ద’ అంటే దమం. అంటే ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకోవాలి. నీకు ఇంద్రియ నిగ్రహం లేదు అనుకో, మనోనిగ్రహం లేదు అనుకో ఏ పని చేసినా ప్రయోజనం లేదు. ఆధ్యాత్మికచింతన మాట అటు ఉంచు నీవు ఈ లోకంలో కూడా ఏదీ సాధించలేవు. అన్ని భోగాలు ఎదురుగా ఉండాలి, నీ మనస్సు చలించకూడదు, అది కంట్రోలు, అది దమం. రెండోది ‘దా’ అంటే దానం. ప్రతీ మనిషికి గివింగ్ హేబిట్ ఉండాలి. ఈమధ్య జరిగిన సంఘటన చెపుతున్నాను. కె.వి. రమణ అని ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, కంప్యూటర్ కంపెనీ పెట్టుకొన్నాడు, చాలా లాభాలు వచ్చాయి. ఆయన షిరిడీ సాయి భక్తుడు. ఆ కంపెనీ నడపటానికి ఎంత డబ్బు అవసరమో చూసుకొని మిగిలిన 30 కోట్లు డబ్బు షిరిడీ బాబా ట్రస్టువారికి ఇచ్చి సేవారంగం, విద్యారంగం ఇలా ఖర్చు పెట్టమని చెప్పాడు. ఆ ట్రస్టు బోర్డువారు ఆయనను గౌరవించి, మీరు ఇచ్చిన డబ్బుకు కృతజ్ఞత

తెలియపరుస్తున్నాము అన్నారు. ఆయన గొప్పతనం చూడండి. ఆయన ఏమి చెప్పారు అంటే భగవంతుడి దయవలన ఆ డబ్బు వచ్చింది. ఆయన ఇచ్చినది ఆయనకే ఇస్తున్నాను. నాకు కృతజ్ఞత చెప్పనక్కరలేదు. అందుచేత మీరు భగవంతుడికి కృతజ్ఞత చెప్పండి అన్నాడు. డబ్బు ఇచ్చేటప్పుడు కూడా నేను ఏదో ఘనకార్యం చేస్తున్నాను అని ఆయన అనుకోలేదు. మనం తమలపాకులో అరటిపండ్లు పెట్టి ఇతరులకు ఎంత తేలికగా ఇస్తామో అంత తేలికగా 30 కోట్లు ఇచ్చాడు. మనం ఏదైనా పనిచేసేటప్పుడు గుర్తింపులు కోరుకొంటాము అనుకోండి. గుర్తింపులు కోరుకోవటం వలన మనకు తెలియకుండా వ్యక్తిభావన పెరిగిపోతుంది. దానం గురించి బైబిలులో ఒక మాట చెప్పాడు. మీ ఆదాయంలో దశమభాగం అంటే మీకు సంవత్సరానికి 10 లక్షలు ఆదాయం వస్తే 9 లక్షలు మీరు ఎంజాయ్ చెయ్యండి, ఒక లక్ష తీసి ఇతరుల కోసం మీకు ఏరకంగా ఇష్టమైతే ఆరంగంలో ఉపయోగించండి, ఆ లక్ష మీది కాదు అనుకోండి అని చెప్పాడు. మూడోది "దయ". నువ్వు ఏ పని చేసినా యాంత్రికంగా చెయ్యకు, హృదయంలో దయారసం పెట్టుకో. నీవు ఇతరులకు డబ్బు ఇయ్యి, మాట సహాయం చెయ్యి, అన్నం పెట్టు. ఏది చేసినా ప్రేమతో వారి పట్ల దయగా ప్రవర్తించు. నీ దయాగుణం వారి చైతన్యస్థాయిని పెంచాలి. తిండి లేనివారిని చూసి, నీడలేనివారిని చూసి కనీసం మనస్సులో అయ్యో అని కూడా అనుకోలేరు అనుకోండి, మీరు దురాత్ములే. నీకు డబ్బు ఉంటే డబ్బు ఇవ్వవచ్చు లేకపోతే లేదు. దయకు డబ్బుకు సంబంధం లేదు. నీవు దయాస్వరూపుడవు అయితే నీకు చదువు వస్తే వారికి చదువు చెప్పవచ్చు లేకపోతే వారు బాగుపడటానికి మంచిమార్గం చూపించవచ్చు, ఇదంతా దయలోనికి వస్తుంది. దయ అనేది ఒక రూపం ధరించి భూమి మీద నడుస్తూ ఉంటే ఎలా ఉంటుందో వాడే గౌతమబుద్ధుడు. దయ వలన నీకు మారు మనస్సు వస్తుంది, లోపల సంస్కరింపబడతావు. కొంతమందికి మాటలో, చేతలో, ఆలోచనలో హింసా ప్రవృత్తి ఉంటుంది. హింసాప్రవృత్తి ఉన్నవాడికి దయ కలుగదు. మనం భౌతికంగా ఏదైనా చేయగలుగుతాం లేకపోతే లేదు. మనం ఎప్పుడూ రైట్‌సైడ్‌లో ఉండాలి కాని రాంగ్ సైడ్‌కు వెళ్ళకూడదు. వ్యవహారంలో ఏదో తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి రాంగ్‌సైడ్‌లో ఉండకూడదు. నీకు చేతనైతే రైట్‌సైడ్‌లో ఉండు, లేకపోతే ఊరక ఉండు. నీవు రాంగ్ సైడ్ లోనికి వెళితే చెడిపోతావు, చరిత్ర హీనుడవు అవుతావు. మీకు డబ్బు ఉంది, చదువు ఉంది, గౌరవం ఉంది, అన్ని అవకాశములు ఉన్నాయి అనుకోండి. మీకు క్రమశిక్షణ లేకపోతే మీరు సుఖపడరు. బాహ్యంగా మనకు ఉన్న అనుకూలపరిస్థితుల కంటే గొప్ప విషయం క్రమశిక్షణ. క్రమశిక్షణ లేనప్పుడు మనం ఇక్కడ సుఖపడలేము, పరలోకంలో సుఖపడలేము. ఉద్యోగానికి

రాజీనామా చేసి మీ సమక్షంలో గడుపుదామని అనుకొంటున్నాను అని భగవాన్‌తో అంటే చైతన్యం అంతటా ఉంది. అంతటా ఉన్న వస్తువును తెలుసుకోవటానికి నువ్వు వివేకం పెంచుకో, వైరాగ్యం పెంచుకో. నువ్వు ఉద్యోగం మానివేసి నా దగ్గర కూర్చొంటే జ్ఞానం వచ్చేయదు, సోమరితనం వస్తుంది అన్నారు. అభ్యాసం, వైరాగ్యం గురించి గీతలో రిపీటెడ్‌గా పరమాత్మ చెప్పాడు. వైరాగ్యం ఉన్న మనిషికి చాపల్యం తగ్గుతుంది. వైరాగ్యం లేని మనిషి కంటే వైరాగ్యం ఉన్నవాడు పని ఎక్కువ చేస్తాడు, బాగా చేస్తాడు. ఎందుచేతనంటే వాడికి ఎటాచ్‌మెంట్ ఉ ండదు. ఫలకాంక్ష మీద మనస్సు ఉన్నవాడు చేతిలో ఉన్న పనిని పాడుచేస్తూ ఉంటాడు. భగవాన్ దగ్గర ఎవరో కూర్చుని మాట్లాడుతూ ప్రపంచయుద్ధం వచ్చేసింది అంటారు. నువ్వు ఆలోచించి ప్రపంచయుద్ధాన్ని ఆపుచేయగలవా అని భగవాన్ అడిగారు. అది నా చేతిలో పని కాదు అన్నాడు. నీ చేతిలో లేని పని గురించి ఆలోచించి ఎందుకు కాలాన్ని వృధాచేసుకొంటావు అన్నారు భగవాన్.

ప్రతీ మనిషిలో ఉన్న బలహీనత ఏమిటి అంటే మనం ఆనందంగా ఉంటే, శాంతిగా ఉంటే మనకు దేవుడు గుర్తుకురాడు, మన తెలివితేటల వలన సుఖంగా ఉన్నాము అనుకొంటాము, దుఃఖం వచ్చింది అనుకోండి అప్పుడు దేవుడు ఇలా చేసాడు అంటాము. నువ్వు అశాంతిగా ఉన్నప్పుడు ఏ దేవుడు కారణం అనుకొంటున్నావో నువ్వు శాంతిగా ఉండటానికి కూడా ఆయనే కారణం అన్న సంగతి మరిచిపోతున్నావు. అంతా ఈశ్వర సంకల్పంతోనే నడుస్తోంది. ఈ జీవకోటి ద్వారా ఈశ్వరుడే పని చేస్తున్నాడు అని నీకు అర్థమైనప్పుడు నీకు అశాంతి రాదు. మనకు శరీరంతోపాటు లోపల మనస్సు ఉంది. శరీరానికి అన్నంపెట్టి, బట్ట కడితే సరిపోదు. లోపల మనస్సును క్రమశిక్షణలో పెట్టాలి, దానికే పూజ, జపం, ధ్యానం మన పెద్దలు ఏర్పాటుచేసారు. సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటం కాదు. నీ కుటుంబ సభ్యులను విడిచిపెట్టి, బాధ్యతలు విడిచిపెట్టి ఎక్కడికో పారిపోవటం కాదు, లోపల వ్యక్తిగతమైన కోరికలు తగ్గించుకొని, మమకారం తగ్గించుకొని, అహంభావ రహితంగా పనిచెయ్యి, అది సన్యాసం. మీరు ఎన్ని మంచి పనులు చేసినా సరే దేహమే సత్యం, దేహమే ఆత్మ అనుకొన్నంతకాలం నిన్ను అశాంతి విడిచిపెట్టదు. మీరు ఏదైనా మంచిపని చేస్తారు అనుకోండి, అందరూ మెచ్చుకొంటారు అని ఎప్పుడూ అనుకోవద్దు. మీ మీద అసూయ ఉన్నవారు మెచ్చుకోరు, దానికి సిద్ధమయ్యే ఆ మంచిపని చెయ్యాలి. వాడు అసూయ పడుతున్నాడు అంటే దానికి మీరు ఆశ్చర్యపడనక్కరలేదు, అది వాడి స్వభావం, అంతకంటే వాడికి ఇంకోటి చేతకాదు. నలుగురు అన్నదమ్ములు ఉన్నారు అనుకోండి. అందులో ఒకడు బాగుపడుతున్నాడు అనుకోండి, మిగిలిన ముగ్గురికి అసూయ

వచ్చేస్తుంది, అది జీవలక్షణం. శరీరంలో మలం ఎలా ఉంటుందో అలాగ మన మనస్సులో కూడా మలం ఉంటుంది. ఇష్టాయిష్టాలు మనస్సులో ఉన్న మలం. నాకు సైకిల్ లేదు. మీరు కష్టపడి సంపాదించుకొని సైకిల్ కొనుక్కొన్నారు, మీమీద నాకు అసూయ వచ్చేస్తుంది ఎందుచేతనంటే నాకు సైకిల్ లేదు కాబట్టి. ఓ మనిషి, ఏదైనా రంగంలో అభివృద్ధిలోనికి వస్తాడు అనుకోండి, వాడు అభివృద్ధిలోనికి వచ్చాక అది మన కళ్లకు కనిపిస్తూ ఉంటుంది. దాని వెనకాల ఎంత పోరాటం ఉందో, ఎంత సహనం ఉందో, వాడు ఎంత కష్టపడ్డాడో ఆ స్ట్రగుల్ మనకు కనబడదు, మన అసూయ ఆ రకంగా ఆలోచించనివ్వదు అందుచేత అది మనకు అర్థం కాదు. కృష్ణుడు అర్జునుడితో మనిద్దరం చాలాకాలం కలిసి తిరిగాము, ఎప్పుడూ నీలో అసూయ కనబడలేదు, నీవు అనసూయుడవు, ఆ ఒక్క సుగుణానికి నీకు లొంగిపోయి నీకు గీతను ప్రవచనం చేస్తున్నాను అన్నాడు పరమాత్మ.

లోకంలో నీకు ఇష్టమైనవి జరుగుతూ ఉంటాయి, ఇష్టం లేనివి కూడా జరుగుతూ ఉంటాయి. నువ్వు చేసే పనిమటుకు ఇష్టంగా, ప్రేమగా చేసుకొంటూ వెళ్ళు. ఈ లోకం ఏమైపోతుంది, అది ఏమైపోతుంది, ఇది ఏమైపోతుంది అని కంగారుపడకు. లోకానికి ఒక కర్త ఉన్నాడు, ఆయన చూసుకొంటాడు. నీలో మంచి లేనప్పుడు లోకానికి మంచి చేస్తాను అంటావు ఏమిటి? నీలో సేవాభావం లేనప్పుడు లోకానికి సేవ చేస్తాను అంటావు ఏమిటి? ఎవరిని మోసం చేస్తావు నువ్వు? మీ ఇంటికి పంచదార అవసరం అనుకోండి. యజమాని పంచదార తెస్తాడు కాని నేను సేవ చేసాను అని అనుకోడు. ఆ పంచదార ఎవరికైనా ఇతరులకు ఇస్తే నేను సేవ చేసాను అనుకొంటాడు, ఇది దుర్మార్గ ప్రవృత్తి. అంటే మీ ఇంటిలోనివారు మీ వాళ్ళు, లోకం పరాయిది, ఇంక నీకు జ్ఞానం ఏమిటి? మీ ఇంట్లోని వారు నీ సొంతం అనుకొంటున్నావు కాబట్టి నువ్వు కష్టపడ్డాను అనుకోవటం లేదు, అదే మీ గ్రామానికో, దేశానికో చేస్తే కష్టపడ్డాను అనుకొంటున్నావు. అంతకంటే దుర్మార్గ ప్రవృత్తి ఏముంది. ఒక కేజీ పంచదార ఎవరికైనా ఇస్తే గుర్తింపు కోరతారు, వాడు జీవితం పొడుగునా బానిసగా ఉండాలి అనుకొంటారు, ఇదంతా అహంభావన యొక్క చేష్టలు. ఈ శరీరం చనిపోయే లోపు అహంభావన అంటే ఇట్టిది అని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. దేవుడు ఉన్నాడా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఆయన ఉన్నాడని చెప్పలేదు, లేడని చెప్పలేదు, నువ్వు ఉన్నావా అన్నారు? నేను ఉన్నాను అని చెప్పాడు. నువ్వు ఉంటే ఆయన లేకుండా ఎక్కడికి పోతాడు, ఆయనా ఉన్నాడు. నువ్వు లేవనుకో ఆయనా లేడు. ఆ నేను లేని స్థితిని మనం ఊహించలేము, అది అనుభవైక వేద్యం. ఇతర లోకాలు ఉన్నాయా అని ఒకరు భగవాన్‌ను అడిగారు ఆయన ఇతర లోకాలు

ఉన్నాయి అని చెప్పలేదు, లేవని చెప్పలేదు. దేహం మరణించాక ఎవడైతే ప్రయాణం చేస్తాడో ఆ ప్రయాణం చేసేవాడు ఎంత నిజమో ఆ లోకాలు కూడా అంతే నిజం. వాడు ఉంటే ఆ లోకాలు ఉన్నాయి, వాడు లేకపోతే అవి కూడా లేవు.

మనకు లోపల సత్వగుణం ఉంది అనుకోండి. క్వయిట్‌గా ఉంటాము, కూల్‌గా ఉంటాము, పని చేసినా చేసినట్లుగా కనబడము. మనం అందరం మంచివారము అనుకోండి, సత్వగుణంలో ఉన్నాము అనుకోండి, ఈ కళ్యాణ మండపంలోనికి వచ్చి వెళ్ళిన జాడ కూడా ఎవరికీ తెలియదు. ఒకో చుట్టం మన ఇంటికి వస్తే వాడు వచ్చి వెళ్ళిన జాడ కూడా తెలియదు, ఒకో చుట్టం వచ్చాడంటే మన కొంప అంతా అల్లరి చేసి వెళ్ళిపోతాడు. మన కొంప అంతా అల్లరి చేసి పోయే చుట్టం రజోగుణంలో ఉన్నాడు, నిశ్శబ్దంగా ఉండి వాడి పని ఏదో వాడు చేసుకొని వెళ్ళిపోయేవాడు సత్వగుణంలో ఉన్నాడు. ఇంక కొంతమంది చుట్టాలు ఉంటారు, ఏమండీ మేము మూడు రాత్రులు ఉండి వెళ్ళిపోతాము అంటారు. శివరాత్రి, సంక్రాంతి, నవరాత్రి ఈ మూడు రాత్రులు చూసి వెళ్ళిపోతే వాడికి సంవత్సరం అయిపోతుంది, వాడు తమోగుణం వాడు. వాడు తినేసి ఊరకే అలా పడి ఉంటాడు. అంటే కంచం, మంచం రెండూ అంటిపెట్టుకొని ఉంటాడు. మనం అభివృద్ధిలోనికి రావాలంటే రజోగుణం తగ్గించుకోవాలి, తమోగుణం తగ్గించుకోవాలి, సత్వగుణాన్ని పెంచుకోవాలి. మీరందరూ కష్టపడి డబ్బు ఎలా సంపాదించుకొంటున్నారో, పిల్లలు కష్టపడి ఎలా చదువు కొంటున్నారో, అలా కష్టపడి మనం సత్వగుణాన్ని సంపాదించుకోవాలి, కష్టపడకపోతే ఏదీ రాదు. ఒకవేళ కష్టపడకుండా వస్తే అది ఎలాగ వచ్చిందో అలాగే పోతుంది. శరీరానికి దుఃఖం రాదు, చైతన్యానికి దుఃఖం లేదు. మధ్యలో ఉన్న అహంభావనకే దుఃఖం వస్తుంది. తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి, అహంభావనకే వస్తున్నాయి, తలంపు లేకుండా దుఃఖం లేదు. దేహం మరణించినప్పుడు నేను చనిపోతున్నాను అని దేహం అనుకోదు, దేహంతో తాదాత్మ్యం పొందే తలంపు అనుకొంటుంది. అందుచేత దేహంతో తాదాత్మ్యం పొందే తలంపు ఎంత నిజమో నీ దేహానికి సంబంధించిన చావు కూడా అంతే నిజం. శాస్త్రకారుడు ఏమని చెప్పాడు అంటే మనిషి 90 సంవత్సరాలు బతికాడు అనుకోండి. మొదటి 30 సంవత్సరాలు కష్టపడి చదువుకో, తరువాత 30 సంవత్సరాలు నువ్వు సంపాదించుకో అంటే బజారులో పడి అడ్డంగా సంపాదించమని కాదు, నీతి న్యాయం కాపాడుకొంటూ సంపాదించుకో. మిగతా 30 సంవత్సరాలు ఆత్మజ్ఞానం సంపాదించుకో. నీవు చేస్తే నిష్కామకర్మ చెయ్యి అంతే గాని సమాజంలో ఏదో గౌరవం ఆశించి పనులు చేస్తే అది సకామకర్మ అవుతుంది కాని నిష్కామకర్మ కాదు. ఏమీ లేదు నాన్నగారు బాగా చెపుతున్నారు అని మీరు అనుకోవాలని

నేను అనుకొంటాను అనుకోండి. నేను ఫెయిల్ అయినట్లే, నేను బాగుపడను, నా అహంభావన పెరుగుతుంది. మీకు శాంతి అందటం లేదు అనుకోండి, నేను చెప్పే సబ్జక్టు మీకు అర్థమవ్వటం లేదు అనుకోండి నేను బాగా చెపితే మటుకు మీకు కలిసివచ్చేది ఏమిటి? చైతన్యంలో ఎక్కువ అనీ, తక్కువ అనీ, పుణ్యం అనీ, సత్కర్మ అనీ, సత్వగుణం అనీ ఏమీ లేవు. కాని నిన్ను ఎందుకు పుణ్యం సంపాదించుకోమంటున్నారు, ఎందుకు సత్కర్మ ఆచరించమంటున్నారు, ఎందుకు సత్వగుణం పెంచుకోమంటున్నారు అంటే చైతన్యాన్ని అందుకోవటానికి ఇవి అన్నీ సహకరిస్తాయి కాబట్టి వీటిని ప్రాక్టీసు చేయమంటున్నారు కాని ఇవి ఏమీ అక్కడ లేవు.

మేము లోకానికి సేవ చేస్తాము అని భగవాన్‌తో అంటే ముందు నీకు నువ్వు సేవ చేసుకో అంటే దాని అర్థం ఏమిటి అంటే ముందు నువ్వు బాగుపడు, నిన్ను నీవు సంస్కరించుకొంటే నిన్ను చూసి అనేకమంది నేర్చుకొంటారు, బాగుపడతారు. నీలో శాంతి లేనప్పుడు, నీలో జ్ఞానం లేనప్పుడు నీవు మాట్లాడినా ప్రయోజనం లేదు, ఆ మాట ఎవడిమీద పని చేయదు. నీకు శాంతి లేనప్పుడు ఎవరికి శాంతిని ఇస్తావు. నథింగ్‌లో నుండి ఏదీ రాదు, సమ్‌థింగ్‌లో నుండి ఏదైనా వస్తుంది. భగవాన్‌తో ఒక ప్లీడరుగారు మాట్లాడుతూ పనిచేసేవాడు ఈశ్వరుడే, వ్యక్తులను పనిముట్లు కింద ఉపయోగించుకొంటాడు అని చెపితే భగవాన్ ఏమి చెప్పారు అంటే మీ నోటితో చెప్పింది మీకు అవగాహనలో ఉంటే దుఃఖం నశిస్తుంది అని చెప్పారు. ఎక్కడో పుస్తకాలు చదివి చెప్పటం కాదు. అంతా ఈశ్వరుడే అనుకొన్నప్పుడు, చేసేవాడు చేయించేవాడు ఆయనే అనుకొన్నప్పుడు నీకు దుఃఖంతో పని ఏముంది. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీకు ధనం ఉంది, అధికారం ఉంది, చదువు ఉంది, గౌరవం ఉంది అన్నీ ఉన్నాయి కాని మీకు దుఃఖం వస్తోంది అనుకోండి ఇవన్నీ ఏమి చేసుకొంటారు. మీకు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా దుఃఖం వస్తూ ఉంటే ఆ కంఫర్ట్సు వలన ప్రయోజనం లేదు. మీకు కంట్రోలులో నుండి ఆనందం వస్తుంది కాని కంఫర్ట్సు నుండి ఆనందం రాదు. ఐశ్వర్యవంతులు అందరూ సుఖంగా ఉన్నారు అని అనుకోవద్దు, ఐశ్వర్య వంతులు అయినా, వారికి మనోనిగ్రహం లేకపోతే సుఖం లేదు, వారికీ దుఃఖమే. ధనం వలన భోగం వస్తుంది, జ్ఞానం వలన శాంతి వస్తుంది, భోగం రోగంగా మారిపోతుంది. ఏరకమైన భోగాలు అయినా కూడా అన్నీ మనస్సులో ముద్రలు వేసి వెళ్ళిపోతాయి.

మీకు దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఈ మూడు వాసనలు లేవు అనుకోండి, ఇంక దుఃఖం రాదు. ఈ లోకంలో అందరూ మిమ్మల్ని గొప్పగా చెప్పకోవాలి అనుకొంటారు అనుకోండి, మిమ్మల్ని గొప్పగా చెప్పకోకపోతే మీకు దుఃఖం వచ్చేస్తుంది. దేహానికి దీనికి సంబంధం

లేదు. అష్టావక్రుడు సభలోనికి వెళ్ళినప్పుడు ఆయన శరీరాన్ని చూసి ఇన్ని వంకరలు ఉన్నాయి ఏమిటి? అని మంత్రులు అందరూ గొల్లుమని నవ్వారు. అప్పుడు అష్టావక్రుడు రాజుతో ఇటువంటి మూర్ఖులను పెట్టుకొని పరిపాలన చేస్తున్నావు ఏమిటి? అన్నాడు. వారు నా శరీరాన్ని చూస్తున్నారు, నా హృదయాన్ని చూడటం లేదు. శరీరాన్ని చూసేవాడు ఛండాలుడు. వారే కనుక పండితులు అయితే వారు నా శరీరాన్ని చూడరు. ఎవడు పండితుడు అంటే కుక్కలో, గోవులో, మనిషిలో, దేవతలలో, రాక్షసులలో, కదిలే వస్తువులో, కదలని వస్తువులో అన్నింటిలోను ఒకే వస్తువును ఎవడైతే చూస్తున్నాడో వాడే పండితుడు. మొన్న మా ఇంటికి 85 సంవత్సరాలు ఉన్నవారు ఒకరు వచ్చారు. మీ వయస్సు ఎంత అని అడిగాను. 85 సంవత్సరాలు అని చెప్పి ఆయన వూరుకోలేదు, 85 సంవత్సరాలు వచ్చిన పిల్లవాడిని అంటున్నారు. అంటే 85 సంవత్సరాలు వచ్చినా నేను చేసుకొనే సాధన చేసుకొంటున్నాను, సాధన విడిచిపెట్టలేదు, నేను చేసుకొనే సత్కర్మ చేసుకొంటున్నాను. అంతేకాని చావు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూడటం లేదు, నేను జీవించి ఉన్న శవం లాగ బతకటం లేదు, నా పని ఏదో, నా సాధన ఏదో నేను చేసుకొంటున్నాను అని చెప్పటం. మీ ఇంట్లో పది మంది సభ్యులు ఉన్నారు అనుకో, ఆ పది మందిని నువ్వు ప్రేమిస్తావు, వారి అవసరాలు ఏమిటో చూస్తున్నావు, ఒక వేళ నీవు ఎర్ర బట్టలు కట్టుకొని ఇల్లు విడిచిపెట్టి బయటకు వచ్చేసావు అనుకో నీ ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులను ఎలా చూసావో మొత్తం సృష్టిని అంతా ఇప్పుడు అలాగ చూడు, అది సన్యాసం. ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులకోసం ఎలా పని చేసావో, బయటకు వచ్చాక సృష్టికోసం అలాగ పనిచెయ్యి. చేసేపని విసుగ్గా చేయవద్దు, అనురాగంతో చెయ్యి. కర్మను యోగంగా చెయ్యి, ఫలితం ఆశించకుండా నార్మల్‌గా, నేచురల్‌గా పని చెయ్యి. అలా నీవు పనిచేస్తూ ఉంటే చెట్టున ముగ్గిన పండు మనం కొట్టనక్కరలేకుండా ఎలా రాలిపోతుందో అలాగ నీవు అహంభావనలో నుండి బయటకు వచ్చేస్తావు, నాచురల్‌గా నార్మల్‌గా దేహాభిమానంలో నుండి బయటకు వచ్చేస్తావు. నీకు ఎప్పుడైతే దేహబుద్ధి పోయిందో అప్పుడు నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. మీరు సాధన చేస్తున్నా అది అజ్ఞానంలో నుండి విడుదలపొందటానికి సహరిస్తోందా, లేదా అనేది చూసుకోండి. నువ్వు చేసేపని వలన దేహాభిమానం తగ్గుతూ ఉంటే అప్పుడు పనిలో ఉన్న అందం నీకు కనిపిస్తుంది, పనిలో భగవంతుడిని చూడు. నువ్వు మంచిగా ఉండు, మంచి చెయ్యి అని శివానంద చెప్పేవారు. మంచి చెయ్యటం కంటే మంచిగా ఉండటం కష్టం. అహంభావన లేనివాడికి ఇష్టం ఏమిటి? అయిష్టం ఏమిటి? కోపం ఏమిటి? రాగం ఏమిటి? ద్వేషం ఏమిటి? ఈ పెంట అంతా ఎక్కడ ఉంది అంటే అహంభావనలో ఉంది.

పెంటమీద కూర్చుని వాసన వస్తోంది అనుకోవటం ఎటువంటిదో అహంభావనలో కూరుకుపోయి అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది అనుకోవటం అటువంటిదే. పెంట మీద కూర్చొన్నవాడికి చెడ్డవాసన వస్తుంది కాని మంచివాసన ఎలా వస్తుంది. అలాగే దేహాభిమానంతో జీవించేటప్పడు దుఃఖం వస్తుందికాని ఆనందం రాదు. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నీవు ఎక్కడ ఉన్నా, నువ్వు ఆత్మజ్ఞానం పొందటానికి నీకు ఏ లోపాలు అడ్డువస్తున్నాయో జాగ్రత్తగా చూసుకొని అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు ఎక్కడ ఉన్నావు అనేది ముఖ్యంకాదు. నీ అలవాట్లలో నుండి, బలహీనతలో నుండి ఎంత వరకు బయటకు వస్తున్నావు అనేది ముఖ్యం. నిన్ను ఏ విషయాలు అయితే బంధిస్తున్నాయో వాటిలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసుకో. పశువును కట్రాడుకు కట్టేసినట్లు పూర్వజన్మ నుండి మోసుకొని వస్తున్న వాసనలు మనలను ఈ శరీరానికి కట్టేసి ఉంచుతాయి. ఈ శరీరం ముసలిది అయి చనిపోయింది అనుకో ఇంకో శరీరం వస్తుంది, కర్మ వాసనలు ఆ శరీరాన్ని పట్టుకొని ఉంటాయి. మీరు ఎక్కడ ఉన్నా ఆ వాసనలలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. ఆత్మచింతన వలన అహంభావన తగ్గుతుంది, విషయచింతన వలన అహంభావన పెరుగుతూ ఉంటుంది. మీరు ఏది చింతిస్తున్నారో జాగ్రత్తగా చూసుకోండి. మీరు జ్ఞానం పొందటానికి ఏదో రూపం అడ్డువస్తోంది అనుకోండి, ఏదో నామం అడ్డువస్తోంది అనుకోండి. ఈ రూపం ఎవరు కల్పిస్తున్నారు, అహంభావన కల్పిస్తోంది, ఈ నామం ఎవరు కల్పిస్తున్నారు, అహంభావన కల్పిస్తోంది అని అర్థం చేసుకొని దానిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 06-06-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీరు ఒక్కటే దానిని అనేక భాషలలో అనేక రకాలుగా పిలుస్తారు. సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. దానినే బ్రహ్మం అంటారు. ఈశ్వరుడు అంటారు, యెహోవా అంటారు, అల్లా అంటారు. ఇలా ఒకో మతంలో ఒకో రకంగా పిలుస్తారు కాని సత్యం ఒక్కటే, నీవు పొందవలసిన గమ్యం ఒక్కటే అది మీరు గుర్తు పెట్టుకొంటే మనస్సులో ఆందోళన రాదు, ఈ మతం కంటే ఆ మతం గొప్పది, ఆ మతం కంటే ఈ మతం గొప్పది అనేటువంటి తలంపులు అసలు మీకు రావు. సత్యం ఒక్కటే దానిని బౌద్ధులు నిర్వాణం అన్నారు. నిర్వాణం అంటే శాశ్వతంగా దుఃఖం లేకపోవటం. ఒకరోజు సంతోషంగా ఉండి, ఇంకో రోజు దుఃఖంగా ఉంటే అది నిర్వాణం కాదు. శాశ్వతంగా దుఃఖం లేకపోవటం నిర్వాణస్థితి. నిర్వాణస్థితి పొందినవాడికి కోరిక ఉండదు, వాడికి పునర్జన్మ